



# దంచి కొట్టిన వాన

- వాగులు, వంకలు పొంగి పొర్లి పలు గ్రామాలకు అంతరాయం

**శెనార్తి మీడియా, శంకరపట్నం:**

జిల్లాలో గురువారం రాత్రి నుంచి శుక్రవారం వరకు కురిసిన భారీ వర్షాలు కరవును తీరుస్తూ పలు మండలాల్లో ఉపశమనం కలిగించాయి. గత మూడు నెలలుగా వానలు పడక రైతులు ఆందోళనలో ఉన్న చిగురుమామిడి, సైదాపూర్, హుజూరాబాద్ మండలాల్లో విస్తారంగా వర్షపాతం నమోదైంది. భారీ వర్షాల ప్రభావంతో వాగులు, వంకలు పొంగిపొర్లాయి. చెరువులు మత్తళ్లు దూకగా, పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

శంకరపట్నం మండలంలో ఎన్‌హెచ్–563 రహదారి నిర్మాణ పనుల కారణంగా సమీప వరి పొలాల్లోకి వరదనీరు చేరి ఇసుక మేటలు పేరుకుపోయాయి. దీంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. పలు గ్రామాల పంట పొలాలు నీటమునిగి నష్టపోయాయి.

**ఇళ్లను చుట్టుముట్టిన వరద.. కాలనీవాసుల ఇబ్బందులు**

శంకరపట్నం తాడికల్ గ్రామ శివారు మేలకుంటలో నీటి ప్రవాహం పెరిగి ఇళ్ల చుట్టూ నీరు చేరడంతో కాలనీవాసులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. చిన్న నీటిపారుదలశాఖ అధికారులు పొక్లెయిన్ యంత్రంతో నీటిని బయటకు తరలించే చర్యలు చేపట్టారు. అయితే ప్రతి వర్షాకాలంలో ఇదే సమస్య పునరావృతమవుతుందంటూ ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. పంటలు నీటమునిగిపోవడంతో రైతులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

## గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్



**శెనార్తి మీడియా, పెద్దపల్లి(ఓదెల):**

పోత్కపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి అక్రమ రవాణా చేస్తున్న వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి నుంచి 4.098 కిలోల ఎండు గంజాయి, ఒక కారు, మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు పెద్దపల్లి ఏసీపీ జి. కృష్ణ తెలిపారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ రూ.2,04,000గా ఉంటుందని వెల్లడించారు. పోత్కపల్లి గ్రామ శివారులోని లక్ష్మీ ప్రసన్న ఫంక్షన్ హాల్ సమీపంలో పోలీసులు శుక్రవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. అదే సమయంలో ఓ కారు వస్తుండగా ఆపి తనిఖీ చేశారు. అందులో ఉన్న వ్యక్తి పారిపోయేందుకు ప్రయత్నించగా వెంటనే అదుపులోకి తీసుకుని తనిఖీ చేశారు. అతని వద్ద గంజాయి పట్టుబడింది. నిందితుడు కంసాని అరుణ్ (20), హుస్నాబాద్ లోని సుభాష్‌నగర్‌లో నివసిస్తూ డ్రైవర్‌గా, హమాలీగా పనిచేస్తు న్నాడు. గంజాయికి బానిసయ్యాడు. ఎక్కువ డబ్బులు సంపాదించాలన్న ఉద్దేశంతో గంజాయి రవాణా, విక్రయంలోకి అడుగు పెట్టినట్టు విచారణలో వెల్లడించాడు. పరారీలో ఉన్న మరో నిందితులు ఇద్దరిని పోలీ సులు గుర్తించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందుకు చెందిన ప్రైవేట్ ట్రావెల్స్ డ్రైవర్ బొల్లెద్దు మహేందర్ (24). చీమల ఆకాష్ (19)గా అని తెలిపారు. వీరు ఒడిశా నుంచి తక్కువ ధరకు గంజాయి తెచ్చుకుని, తెలంగాణలో ఎక్కువ ధరకు అమ్ముతున్నారని పోలీసులు తెలిపారు.పోలీసుల విచారణలో అరుణ్ వీరితో కలిసి గంజాయి వాడటమే కాకుండా, విక్రయం చేస్తున్నట్లు ఒప్పుకున్నాడు. హుస్నాబాద్, కరీంనగర్, గోదావరిఖని, పెద్దపల్లి, సుల్తానాబాద్, ఓదెల ప్రాంతాల్లో విద్యార్థులు సహా ఇతరులకు కిలోకు రూ.50,000 ధరకు విక్రయిస్తున్నట్టు తెలిపాడు. ఈ సారి కూడా 5 కిలోల గంజాయిని కొనుగోలు చేసి హుస్నాబాద్‌కు తరలిస్తుండగా పట్టుబడ్డాడు. ఈ ఆపరేషన్‌లో సీఐ సుల్తానాబాద్ జి. సుబ్బారెడ్డి, ఎస్ఐ దీకొండ రమేష్ ఆధ్వర్యంలో ఏఎస్ఐ రత్నాకర్, కానిస్టేబుళ్లు రాజు యాదవ్, హరీష్, రాము, శివశంకర్, రాజేందర్, రాజు, రమేష్ పాల్గొన్నారు. వీరిని ఏసీపీ జి. కృష్ణ అభినందించారు. ఏసీపీ జి. కృష్ణ మాట్లాడుతూ గంజాయి పండించినా, రవాణా చేసినా, అమ్మినా, వాడినా ఎట్టి పరిస్థితుల్లోనూ విడిచిపెట్టబోమని హెచ్చరించారు. రామగుండం కమిషనర్ ఆదేశాల మేరకు గంజాయి అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి సారించి చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు.



## ఆరోగ్య మహిళను సద్వినియోగం చేసుకోవాలి

**శెనార్తి మీడియా, శంకరపట్నం:**

శంకరపట్నం మండలంలోని కొత్తగట్టు గ్రామ అంగన్వాడి సెంటర్లో శుక్రవారం సూపర్వైజర్ పద్మ ఆధ్వర్యంలో ఆరోగ్య అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల్లో సహజంగానే కాల్షియం లోపం ఎక్కువగా ఉంటుందని, దీన్ని నివారించడా నికి నువ్వులు, బెల్లం, పల్లీలు ఆహారంలో తప్పనిసరిగా చేర్చుకోవాలని సూచించారు. పిల్లలకు బయట తయారైన ఆహార పదార్థాలు ఇవ్వకుండా, ఇంట్లో తయారైనవే అందించాలని తల్లులను కోరారు. సెక్రటరీ మాట్ల రాజేష్ మాట్లాడుతూ టీబిని ముందుగానే గుర్తిస్తే సులభంగా నివారించవచ్చని, ఇందుకు కుటుంబ సభ్యుల సహకారం అవసరమని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచిత పరీక్షలు, మందులు అందుబాటులో ఉన్నా యని, టిబి పేషెంట్లకు నెలకు రూ.1000 ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. మహేశ్వరి మాట్లాడుతూ ఆరోగ్య మహిళ ప్రోగ్రామ్‌ను వినియోగించుకోవాలని, ప్రతి ఒక్కరు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్ సరోజన, ఏఎన్ఎం రాణి, అంగన్వాడి టీచర్, ఆశా వర్క ర్లు, తల్లులు పాల్గొన్నారు.

## సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల అరెస్టు సరికాదు

- ఏఐటీయూసీ పెద్దపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి సునీల్

**శెనార్తి మీడియా, రామగుండం:**

సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను వివరించడానికి ప్రజా భవన్‌కు వెళ్తున్న కాంట్రాక్ట్ కార్మికుల జేఏసీ నాయకులను పోలీసులు అడ్డుకోవడం, అరెస్ట్ చేయడం సరి కాదని ఏఐటీయూసీ పెద్దప ల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి సునీల్ డిమాండ్ అన్నారు. తీవ్ర ఆగ్రహానికి దారితీసింది. జేఏసీ నాయకులు తోకల రమేష్, మద్దెల శ్రీనివాస్, రాజేందర్ తదితరులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు ప్రజా భవన్‌కు ఎవరైనా వచ్చి ప్రశ్నించవచ్చని చెప్పిన ముఖ్యమంత్రి, ఇప్పుడు ప్రశ్నించే గొంతులను అణచివేయడానికి అరెస్టులు చేయడం స్వేచ్ఛకు సంకెళ్లు వేయడమేనని విమర్శించారు. ప్రజా సమస్యలు అడగడం ప్రజాస్వామ్యంలో హక్కు అని గుర్తు చేశారు. సింగరేణి యాజమాన్యం కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్ట్ కార్మికులందరిని రెగ్యులరైజ్ చేయడానికి వెంటనే జీవో జారీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

## విద్యాసంస్థల పునర్నిర్మాణానికి ఏఐఎస్ఎఫ్ డిమాండ్



**శెనార్తి మీడియా, పెద్దపల్లి:**

పెద్దపెల్లి జిల్లా కేంద్రంలో శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలను తక్షణమే పునర్నిర్మించాలని ఆల్ ఇండియా స్టూడెంట్స్ ఫెడరేషన్ (ఏఐఎస్ఎఫ్) నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు జిల్లా కలెక్టర్ హర్షకు వినతి పత్రం అందజేశారు. విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, సంక్షేమ హాస్టళ్లకు ప్రత్యేక నిధులు కేటాయించాల్సిన అవసరం ఉందని నాయకులు పేర్కొన్నారు. సంక్షేమ హాస్టళ్లకు స్వంత భవనాలు కేటాయించాలని, విద్యారంగం అభివృద్ధి కోసం తగిన నిధులు కేటాయించాలని కోరారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం మాట్లాడుతూ విద్యాసంస్థల పరిస్థితిని మెరుగుపరచడం అత్యవసరమని, ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సాయి ఆజాద్, జిల్లా కోశాధికారి ఎల్కపల్లి సురేష్ పాల్గొన్నారు.

## ఆకెనపల్లిలో రేషన్ కార్డుల పంపిణీ



**శెనార్తి మీడియా, రామగుండం:**

రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ ఆదేశాల మేరకు ఆకెనపల్లి గ్రామంలో 100 రేషన్ కార్డులను గాదె సుధాకర్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మంథని మహేందర్, ఐలవేణి అనసూర్య, మర్రి రాజ్‌కుమార్, బరిగేలా భీమయ్య, బరిగేలా సతీష్, కనుకయ్య, రైల్లా సాగర్, ఐలవేణి నగేష్, సొల్లు పోచం, గెల్లు కొమురయ్య, శ్రీరాముల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ఉత్సాహంగా ఫ్రెషర్స్ డే వేడుకలు..



**ఆకట్టుకున్న విద్యార్థుల నృత్యాలు**

**శెనార్తి మీడియా,ఆదిలాబాద్:**

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు ఉత్సాహభరిత వాతావరణంలో సాగాయి.శుక్రవారం నిర్వహించిన వేడుకల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పలువురు విద్యార్థులు సినీ గీతాలకు తగ్గట్లు నృత్యాలు చేస్తూ సందడి చేశారు.తోటి విద్యార్థుల కేరింతలు,చప్పట్ల నడుమ వేడుకలు కన్నుల పండువగా సాగాయి.కళాశాల ప్రిన్సిపాల్ అతిక బేగంతో పాటు అధ్యాపకులు పాల్గొన్నారు.విద్యార్థుల నృత్య ప్రదర్శనలను ఆసక్తిగా తిలకించి వారిని అభినందించారు.ఫ్రెషర్స్ డే వేడు కలతో కళాశాల ప్రాంగణంలో కోలాహల వాతావరణం కనిపించింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడు తూ.. ఉన్నత లక్ష్యాలకు అనుగుణంగా కష్టపడి చదివితే సత్ఫలితాలు వస్తాయని,ఆ దిశగా నిరంతర సాధన చేయాలని సూచించారు. ఇక్కడ వైస్ ప్రిన్సిపల్ రఘు గణపతి, కరుణాకర్,కోటయ్య,రేఖ, స్వప్న బోధన బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.



## బాల్య వివాహాలపై ష్యూర్ ఎన్జీవో అవగాహన




**శెనార్తి మీడియా, ఆదిలాబాద్:**

బాల్య వివాహాలను పూర్తిస్థాయిలో రూపుమాపడానికి తమ వంతుగా పూర్తి సహకారం ఉంటుందని,ఆడపిల్లలకు 18 సంవత్సరాలు దాటిన తర్వాతనే వివాహాలు చేయాలనీ జమాతే ఉల్మా ఏ హింద్ కోశాధికారి మౌలానా అబ్దుల్ అజీం ఆసాది తెలిపారు.ఆదిలాబాద్ పట్టణంలోని మహ్మదీయ మసీదు వద్ద ష్యూర్ ఎన్జీవో ఆధ్వర్యంలో బాల్య వివాహలపై ముస్లిం మత పెద్దలతో కలిసి అవగాహనా కల్పించారు.బాల్య వివాహాలతో కలిగే అనర్ధలను సీడబ్ల్యూసీ సభ్యులు సమీరుల్లా ఖాన్ వివరించారు.ఈ సందర్భంగా మౌలానా అబ్దుల్ అజీం ఆసాది మాట్లాడుతూ.. బాల్య వివాహాలను అంతం చేయడం అతిపెద్ద సామాజిక నైతిక బాధ్యత అని గుర్తు చేశారు. బాల్య వివాహం జరిగితే బాలిక శారీరకమైన, మానసికమైన ఒత్తిడికి గురవుతుందన్నారు.వారి విద్య మధ్యలోనే ముగుస్తుందన్నారు.ప్రతి ఒక్కరు బాధ్యతాయుతంగా బాల్య వివాహ రహిత భారత దేశ నిర్మాణానికి కృషి చేయాలనీ అన్నారు.కార్యక్రమంలో మసీద్ కమిటీ సభ్యులు మొహమ్మద్ జాహిద్, అఫ్రోజ్ ఖాన్, సాజితోద్దీన్, మహమ్మద్ సలీం, అవేస్, అమీన్ షరీఫ్, ష్యూర్ ఎన్జీవో జిల్లా కోఆర్డినేటర్ కె వినోద్,ఫీల్డ్ సూపర్వైజర్ సంపత్, కిరణ్,రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## రక్తదానానికి యువత ముందుకు రావాలి..




**శెనార్తి మీడియా,ఆదిలాబాద్:**

రక్తదానానికి యువత ముందుకు రావాలని సామాజిక కార్యకర్త జక్కుల రవీందర్ అన్నారు.తలమడుగు మండలం దేవాపూర్ జూనియర్ లైన్ మెన్ గోవర్ధన్ రాజు జన్మదిన సందర్భంగా.. జక్కుల రవీందర్ రక్తదానం చేశారు.రక్తదానం చేయడం ద్వారా అత్యవసర సమయంలో మరొకరికి మన రక్తం ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.రక్తదానం చేయడం మంచిదని తెలిపారు.

## యువ వికాసంతో రుణాలు మంజూరు చేయాలి

- ఎర్రం నర్సింగరావు..

**శెనార్తి మీడియా,ఆదిలాబాద్:**



యువతకు 'యువ వికాసం' పథకం కింద ప్రభుత్వం రుణాలను మంజూరు చేసి ఆదుకోవాలని జిల్లా యువజన సంఘాల సమితి అధ్యక్షుడు ఎర్రం నర్సింగరావు డిమాండ్ చేశారు.6 నెలలు గడిచినా ప్రభుత్వం ఇప్పటివరకు ఎలాంటి ప్రకటన చేయకపోవడంతో యువత నిరుత్సాహానికి గురవుతోందని అన్నారు. గతేడాది జూన్ 2న రుణాలను మం జూరు చేస్తామని చెప్పి, ఇంతవరకు ఇవ్వలేదని ఆయన ఆరోపించారు. ప్రభుత్వం రుణాలను మంజూరు చేసి యువతకు అండగా నిలవాలని ఆయన కోరారు.

## ట్రాక్టర్ బోల్తా పడి ..

**శెనార్తి మీడియా, నిజామాబాద్:** బోధన్ మండలం బెక్ నెల్లి గ్రామపంచాయతీకి చెందిన ట్రాక్టర్ రాంపూర్ సబ్ స్టేషన్ నుంచి విద్యుత్ స్తంభాలను తీసుకు వస్తుండగా కల్దుర్కి – సిద్ధాపూర్ మార్గమధ్యంలో ప్రమాదానికి గురైంది. ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడటంతో విద్యుత్ స్తంభాలు గ్రామ పంచాయతీ సిబ్బంది మీదపడగా, వారు అక్కడికక్కడే ఇద్దరు మృతి చెందారు. డ్రైవర్ కు తీవ్ర గాయాలు అయినట్లు తెలుస్తోంది. మృతులు విధుల నిర్వహణలో భాగంగా ప్రయాణిస్తుండగా ఈ దుర్ఘటన జరగడం స్థానికంగా కలకలం రేపింది.